క్లుప్తంగా

వెంకన్న రథానికి రక్షణ కల్పించాలి



రక్షణ లేకుండా షెల్టర్‌లో పెట్టి వదిలేసిన వెంకన్న రథం

యానాం: యానాం పట్టణంలో 200 ఏళ్ల పురాణ ప్రాశస్త్యం, ఆధ్యాత్మిక విశిష్టత కలిగిన వేంకటేశ్వర స్వామి(మీసాలవెంకన్న) స్వామివారి రథానికి రక్షణ కల్పించకుండా నిర్లక్ష్యంగా వదిలివేయడంపై గురువారం పలువురు భక్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇక్కడ మార్చి, ఏప్రిల్ మాసాల్లో స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహిస్తుంటారు. ఈ సందర్భంగా స్వామివారి రథాన్ని ఊరేగించి తిరిగి స్థానిక కొత్తబస్టాండ్‌లో వేసిన షెల్టర్‌లో పెడుతుంటారు. అయితే స్వామివారి రథాన్ని షెల్టర్‌లో పెట్టి నెలల తరబడి వదిలేసారని కనీసం ఎవరూ ప్రవేశించకుండా తలుపులు సైతం మూయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రథానికి ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. తక్షణం దేవస్థానం అధికారులు చర్య తీసుకోవాలని వారు కోరారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

అల్లవరం: బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ ప్రభావంతో శుక్రవారం నుంచి డిసెంబర్ 5వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో అల్లవరం తహసీల్దార్ కార్యాలయంలో తుఫాన్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ నరసింహారావు గురువారం తెలిపారు. తీరం వెంబడి ఈదురు గాలులతో కూడిన బలమైన వర్షం కురిసే అవకాశం ఉందన్నారు. మత్స్యకారులు సముద్రంలోకి చేపల వేటకు వెళ్లరాదని సూచించారు. రైతులు తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, ధాన్యం రాశులపై బరకాలు కప్పి వర్షం నుంచి కాపాడుకోవాలని సూచించారు. అల్లవరం తహసీల్దార్ కార్యాలయంలో 24 గంటలూ సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. తుఫాన్ కారణంగా ఏదైనా సమస్య ఉత్పన్నమైతే కంట్రోల్ రూమ్ నెంబర్ 9652658677 కి ఫోన్ చేసి సహాయం పొందవచ్చని తెలిపారు.

కాశీకి పాదయాత్ర

ఐ.పోలవరం: కరప మండలం జి భావవరం గ్రామానికి చెందిన భక్తుడు ఉంద్రు లోవరాజు కాశీకి కాలి నడకన యాత్ర చేపట్టి పలువురిని ఆశ్చర్యానికి గురి చేశారు. ఇక్కడి నుంచి కాశీకి సుమారు 1500 కిలోమీటర్ల మేర నడక సాగించాల్సి ఉంటుంది. గత సోమవారం శివమాల ధరించి జెండా చేతపట్టి పాదయాత్ర మొదలు పెట్టారు. గురువారం రాత్రి మురమళ్ల వీరేశ్వర స్వామి ఆలయానికి చేరుకున్నాడు. తెల్లవారు జామున ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపి కుండలేశ్వర స్వామిని దర్శించుకొని కోటిపల్లి, ద్రాక్షరామ మీదుగా ముఖ్య క్షేత్రాలు దర్శిస్తూ వారణాసి చేరుకొంటానని తెలిపారు. లోక కల్యాణార్థం ఈ పాదయాత్ర చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వీరేశ్వరస్వామి అన్నదాన ట్రస్ట్‌కు విరాళం

ఐ.పోలవరం: నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల వీరేశ్వరస్వామి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు గురువారం భక్తుడు విరాళం అందించారు. పెదమడి గ్రామానికి చెందిన దాట్ల బుచ్చి కృష్ణంరాజు రూ.10,116ల విరాళాన్ని ఆలయ పర్యవేక్షణ అధికారి కఠారి శ్రీనివాస రాజుకి అందజేశారు. దాతను సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ అభినందించారు. ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ యనమండ్ర సుబ్బారావు పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ మర్యాదలతో సత్కరించారు.

అగ్ని ప్రమాదంలో ఐదిళ్లు దగ్ధం

రూ.8 లక్షల ఆస్తి నష్టం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అయినవిల్లి: మండలంలోని చింతనలంక గ్రామంలో గురువారం జరిగిన అగ్నిప్రమాదంలో ఐదు ఇళ్లు పూర్తిగా, ఒకటి పాక్షికంగా బూడిదయ్యాయి. ఫైర్ ఆఫీసర్ కొండబాబు, స్థానికుల వివరాల మేరకు, చింతనలంక పంట కాలువ లాకుల వద్ద విద్యుత్ స్తంభంపై నుంచి రాజుకున్న నిప్పురవ్వలతో ఇళ్లకు మంటలు వ్యాపించాయి. ఈ ఘటనలో సవరపు సుబ్బారావు, సవరపు నాగూరు, ముమ్మిడివరపు అబ్బులు, ముమ్మిడివరపు పుల్లయ్య, సవరపు సోమరాజు, కొల్లు కనక దుర్గ, సవరపు నాగరత్నానికి చెందిన కుటుంబాలు కట్టుబట్టలతో నిరాశ్రయమయ్యాయి. సిలిండర్లు, గృహోపకరణాలు, వస్త్రాలు, నగదు, బంగారం కాలిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని, మంటలను అదుపు చేశా రు. రూ.8 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్టు ఫైర్ ఆఫీసర్ తెలిపారు. ఎమ్మెల్యే సత్యనారాయణ, ఎంపీడీఓ భీమారావు, తహసీల్దార్ నాగ లక్ష్మమ్మ బాధితులను పరామర్శించారు.

చినుకు పడితే చిత్తడే..!

- అధ్వానంగా పాఠశాలల్లోని ఆట స్థలాలు
- అడుగేయాలంటే భయపడుతున్న విద్యార్థులు
- జగదిగ్బంధంలో లోతట్టు బడులు
- మధ్యాహ్న భోజనం తయారీకి ఇబ్బందులు
- దృష్టి సారించని యంత్రాంగం



గచ్చకాయలపోరలో సొంత ఖర్చుతో గ్రామస్తులు అభివృద్ధి చేసిన జెడ్పీ పాఠశాల మైదానం

కాట్రేనికోన: ముమ్మిడివరం నియోజకవర్గ పరిధిలోని కాట్రేనికోన, ముమ్మిడివరం, తాళ్లరేవు, ఐ.పోలవరం మండలాల పరిధిలోని పాఠశాలల ఆట స్థలాలు అధ్వానంగా తయారై నిరుపయోగంగా మారుతున్నాయి. చినుకు పడితే చాలు చిత్తడిగా మారుతున్నాయి. పాఠశాల ఆటస్థలాలు, పరిసరాలను దాటి తరగతులకు వెళ్లలేక విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. కాట్రేనికోన మండలంలో 8 జెడ్పీ, 10 ప్రాథమికోన్నత, 64 ప్రాథమిక పాఠశాలల్లో సుమారు 8వేల మంది విద్యార్థులు చదువులు సాగిస్తున్నారు. మండలంలో తీర ప్రాంతాలలో ఉన్న పాఠశాలలే కాకుండా కందికుప్ప, దొంతికుర్రు, పెనుమల్లే, చెయ్యేరు, సాపేవారిపేట జెడ్పీ పాఠశాలల్లోని ఆట స్థలాలు పల్లంగా ఉండటంతో చిన్న పాటి వర్షానికే జలమయమవుతున్నాయి. ఆట స్థలాలలో నీరు నిలువ ఉండటంతో పచ్చ గడ్డి కుళ్లి దుర్వాసన వెదజల్లడమే కాక బురద మయంగా మారుతోంది. దొంతికుర్రు, కందికుప్ప, చెయ్యేరు జెడ్పీ, ఎంపీపీ పాఠశాలల్లో ఆటస్థలాలు ఉన్నా గడ్డి మొలచి పోవడంతో వర్షపు నీటికి కుళ్లిపోయి దుర్గంధం రావడంతో విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ పాఠశాలకు చేరువలోనే అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. బలుసుతిప్ప ఎంపీపీ పాఠశాల మైదానం లోతట్టు ప్రాంతంలో ఉండటంతో ఉప్పుటేరు పోటు పాటులకు నీరు రావడం, వర్షాకాలంలో పూర్తిగా జలమయం కావడంతో ఆటలు ఆడుకునేందుకు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పోర ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల చుట్టూ నీరు నిత్యం ఉండటంతో జల దిగ్బంధంలో ఉన్నాయి. వర్షం పడిందంటే పాఠశాలలో మధ్యాహ్న భోజనం తయారు చేయాలన్నా, విద్యార్థులకు పెట్టాలన్నా పడరాని పాట్లు పడుతున్నారు. పాఠశాలల నిర్మాణం చేపట్టి చేతులు దులుపుకుంటున్న అధికారులు, ప్రజాప్రతినిధులు లోతట్టు ప్రాంతాలలో ఉన్న ఆట స్థలాలను మెరక చేయాలనే విషయాన్ని మరిచారు. దొంతికుర్రు, కందికుప్ప పాఠశాలల్లో ఆట స్థలాలను మెరక చేయడంలో ప్రజాప్రతినిధులు అలసత్వం వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గచ్చకాయలపోర జెడ్పీ పాఠశాల లోతట్టు ప్రాంతంలో ఉండటంతో పోటు పాటులకు నీటితో నిండిపోయేది. విద్యార్థులు ఆటలు ఆడుకునేందుకు ఆటస్థలం ఉన్నా నిరుపయోగంగా ఉండటంతో గ్రామస్తులే సుమారు రూ.10 లక్షలు ఖర్చు చేసి ఆటస్థలాన్ని అభివృద్ధి చేశారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి లోతట్టు ప్రాంతాలలోని పాఠశాలల ఆట స్థలాలను మెరక చేయాలని పలువురు కోరుతున్నారు.

ఆటలు ఆడేదెలా..

కందికుప్ప జెడ్పీ ఉన్నత పాఠశాల ఆటస్థలం పల్లంగా ఉండటంతో వర్షపునీరు నిల్వ ఉండిపోతోంది. దీంతో ఆటస్థలం బురదమయంగా మారుతుంది. గడ్డి కుళ్లిపోయి దుర్వాసన వస్తోంది. అధికారులు దృష్టిపెట్టి ఆట స్థలాలను బాగుచేయాలి.

– సాపే సూర్యప్రకాశ్, పల్లంకుర్రు.

సైన్స్‌తోనే సమాజ అభివృద్ధి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జేవీవీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, యూటీఎఫ్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: సమాజ సర్వతోముఖాభివృద్ధి సైన్స్‌తో ముడిపడి ఉందని, దాని ద్వారానే అభివృద్ధిని సాధించాలని జన విజ్ఞాన వేదిక (జేవీవీ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ అన్నారు. స్థానిక ఎంప్లాయిస్ హోమ్‌లో జేవీవీ ప్రచురించిన కరపత్రాను ఆయన గురువారం ఆవిష్కరించి ప్రసంగించారు. జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఖాజా మొహిద్దీన్ మాట్లాడుతూ విద్యారంగ అభివృద్ధిలోనూ సైన్స్ పాత్ర కీలకంగా ఉందని చెప్పారు. అనంతరం ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బొర్రా గోపీమూర్తిని బలపరుస్తూ వక్తలు ప్రసంగించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంటీవీ సుబ్బారావు, జిల్లా కార్యదర్శి పెన్నాడ శ్రీనివాసరావు, జేవీవీ జిల్లా కోశాధికారి జి.త్రినాథ్ కుమార్, జిల్లా ఆడిట్ కన్వీనర్ బీఎస్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వరికోతలు



గొల్లవిల్లిలో యంత్రంతో వరికోత



భీమనపల్లిలో కల్లాల్లో ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకుంటున్న రైతులు

తుపాను హెచ్చరికతో రైతన్నల ఆందోళన

ఉప్పలగుప్తం: ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో అధిక వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు హెచ్చరికలు జారీ చేయడంతో మండలంలో గురువారం వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. పండిన పంట చేతికి రావటంతో రైతులు హడావుడిగా యంత్రాలతో కోతలు నిర్వహిస్తున్నారు. కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని మెరక ప్రాంతాలకు చేర్చుకుంటున్నారు. ఖరీఫ్ పంట మొదలైన నాటి నుంచి నానా అవస్థలు పడి సాగు చేశామని రైతన్నలు చెబుతున్నారు. తీరా పంట చేతికొచ్చే సమయానికి తుఫాన్ ప్రభావంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

రహదారి మధ్యలో ఇనుప స్తంభాల తొలగింపు



కుందులపాడులో ఇనుప స్తంభాలను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

అమలాపురం రూరల్: బండారులంక పంచాయతీ పరిధిలోని కుందులపాడు పంచాయతీ రహదారిపై కొంతమంది అక్రమంగా రోడ్డు మధ్యలో వేసిన ఇనుప స్తంభాల కారణంగా గత తొమ్మిది నెలలుగా కందులపాడు గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీనిపై బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన సైతం తెలిపారు. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు దృష్టికి సమస్య తీసుకెళ్లగా ఆయన స్పందించి రోడ్డుకి మధ్యలో అక్రమంగా పాతిన ఇనుప స్తంభాలను తక్షణం తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. పంచాయతీ అధికారులు గ్రామ పెద్దల సమక్షంలో గురువారం రోడ్డుకు అడ్డంగా ఉన్న ఇనుప స్తంభాలను తొలగించారు. రోడ్డుకు మోక్షం కల్పించిన ఎమ్మెల్యే ఆనందరావు, ఇనుప స్తంభాలు తొలగించే వరకు ఉద్యమం చేసిన బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొలమూరి మోహన్ బాబుతో పాటు విద్యార్థి సంఘం నాయకులు రేవు తిరుపతిరావు, పంచాయతీ, రెవిన్యూ, పోలీస్ అధికారులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

డీఎస్పీ రఘువీర్ విష్ణు



మాట్లాడుతున్న కాకినాడ డీఎస్పీ రఘువీర్ విష్ణు

తాళ్లరేవు: రోజురోజుకు పెరిగిపోతున్న సైబర్ నేరాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని, ఆయా నేరాలపై అవగాహన పెంచుకోవాలని కాకినాడ డీఎస్పీ రఘువీర్ విష్ణు తెలిపారు. గురువారం పటవల పైడా ఇంజినీరింగ్ కళాశాలలో సైబర్ క్రైమ్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన డీఎస్పీ సైబర్ నేరాలు జరుగుతున్న తీరు, వాటివల్ల యువత నష్టపోతున్న తీరు గురించి విద్యార్థులకు అవగాహన కలిగించారు. వివిధ సైబర్ నేరాలకు సంబంధించి వీడియోలు, పోస్టర్ల ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ రూరల్ సీఐ చైతన్య కృష్ణ, కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ, పైడా కళాశాల కరస్పాండెంట్ పైడా సత్య శ్రీరామ్, డీన్ ఎం.వీరభద్రరావు, ప్రిన్సిపాల్ పీవీ సూర్యప్రకాష్, ప్రొఫెసర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినుల ప్రతిభ అభినందనీయం

డీఐఈవో సోమశేఖరరావు



కళాశాలలో ప్రచార కర దీపికలను ఆవిష్కరిస్తున్న డీఐఈవో సోమశేఖరరావు, ప్రిన్సిపాల్, అధ్యాపకులు

అమలాపురం టౌన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినులు ప్రతిభావంతులుగా ఎదగడం అభినందనీయమని జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ (డీఐఈవో) వనుము సోమశేఖరరావు అన్నారు. అమలాపురం ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో ఆయన 'కళాశాల ప్రగతి మైలురాళ్లు' అనే ప్రచార కర దీపికను గురువారం ఆవిష్కరించి ప్రసంగించారు. ఇదే కళాశాలలో గత విద్యా సంవత్సరంలో చదివిన పడగ కృష్ణ సత్యశ్రీ బిందు తిరుపతి కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్‌లో పశు వైద్య కోర్సుకు ఎంపిక కావడం పట్ల డీఐఈవోతో పాటు కళాశాల ప్రిన్సిపాల్ కడియం శిరీష, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు. తమ కళాశాలలో విద్యను అభ్యసించి మంచి మార్కులతో ఉత్తీర్ణులై ఎందరో విద్యార్థులు నేడు దేశంలోని ప్రముఖ ఇంజినీరింగ్, వైద్య విద్యా సంస్థల్లో సీట్లు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ శిరీష చెప్పారు. ఈ విద్యా ప్రగతిని, విజయాలను దృష్టిలో పెట్టుకుని తల్లిదండ్రులు తమ ఆడపిల్లలను ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో చేర్చాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

భీకన్నకు మాజీ మంత్రి విశ్వరూప్ నివాళులు



వైఎస్సార్ సీపీ నాయకుడు భీకన్న చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి విశ్వరూప్, పార్టీ నాయకులు

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు దివంగత అప్పారి భీకన్న ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక కాలేజీ రోడ్డులోని భీకన్న కుటుంబీకుల ఇంటికి విశ్వరూప్, పార్టీ నాయకులు గురువారం వెళ్లి పరామర్శించారు. అల్లవరం ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, కౌన్సిలర్ గొవ్వాల రాజేష్ తదితరులు భీకన్నకు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

ఎలక్ట్రీషియన్స్ కార్తిక వన సమారాధన

యానాం: యానాం నియోజకవర్గ ప్రైవేట్ ఎలక్ట్రీషియన్స్ అండ్ రీవైండింగ్ వర్కర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో గురువారం కార్తిక వన సమారాధన ఘనంగా జరిగింది. కార్యక్రమానికి హాజరైన ఎన్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లాడి శామ్యూల్ మాట్లాడుతూ ఎలక్ట్రీషియన్స్, రీవైండింగ్ సంక్షేమ సంఘాన్ని పదేళ్ల క్రితమే ఏర్పాటు చేసుకుని వాటి ద్వారా సాటి వర్కర్లకు సహాయపడటం అభినందనీయమని అన్నారు. వారికి అన్ని విధాలా సహాయపడతానని పేర్కొన్నారు. సంఘం ద్వారా సభ్యులకు రూ.5లక్షల మేర ఇన్సూరెన్స్ అందిస్తున్నామని సంఘ సభ్యులు తెలిపారు. కోపరేటివ్ రుణాలు, గ్రూపు రుణాలు తదితర వాటిని సంఘం ద్వారా అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మికశాఖ సిబ్బంది ఎ సత్యనారాయణ, పోతాబత్తుల శ్రీనివాస్, మురళి తదితరులు పాల్గొన్నారు.

పేరెంట్స్ కమిటీ సమావేశాలు నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ బొజ్జా రమణశ్రీ

ముమ్మిడివరం: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న బడివైపు ఒక అడుగు కార్యక్రమంలో భాగంగా వచ్చే నెల 7న ప్రతి ప్రభుత్వ పాఠశాలలో తల్లితండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశాలు ఏర్పాటు చేయాలని ఎంఈఓలు బి.రమణశ్రీ, ఆర్.ఉదయ్ భాస్కరరావులు సూచించారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రొటోకాల్ ప్రకారం ప్రజా ప్రతినిధులు, కమిటీ చైర్మన్లు, తల్లితండ్రులను ఆహ్వానించి సమావేశాలను నిర్వహించాలని సూచించారు. తమ పిల్లలు చదువులు సాగిస్తున్న తీరును తల్లిదండ్రులకు తెలియజేయాలన్నదే దీని ప్రధాన ఉద్దేశ్యమన్నారు. సమావేశంలో మండలంలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్ట్ ఆఫ్ పేరెంటింగ్‌పై అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ సతీష్

అమలాపురం రూరల్: తల్లిదండ్రులు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు రూపకల్పన చేయాలని డాక్టర్ మాకిన సతీష్ అన్నారు. కామనగరువులోని ఆదిత్య స్కూల్‌లో ప్రముఖ కార్పొరేట్ అకడమిక్ ట్రైనర్ సైక్రియాలజిస్ట్ మాకిన సతీష్ తల్లిదండ్రులకు, విద్యార్థులకు మూడు రోజులుగా ఆర్ట్ ఆఫ్ పేరెంటింగ్ అనే అంశంపై సెమినార్‌ను నిర్వహిస్తున్నారు. గురువారం ఆఖరి రోజు ముగింపు సభలో డాక్టర్ సతీష్ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలను పెంచడంలో ఎదుర్కొంటున్న సవాళ్లను ఎలా పరిష్కరించుకోవలనే విషయాలపై వివరించారు. మారుతున్న ప్రస్తుత ప్రపంచంలో పిల్లల పెంపకం పెను సవాలుగా మారుతున్న తరుణంలో తల్లిదండ్రులు వారి పెంపకం విషయంలో ఎటువంటి విధానాలు అవలంబించాలో వివరించారు. ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, డైరెక్టర్ ఎన్.శృతి రెడ్డి, విద్యాసంస్థల అకాడమిక్ కోఆర్డినేటర్ రాజేష్, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ చలపతిరావులు వక్తకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ రామప్రసాద్ అధ్యక్షతన వహించారు. వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీ సుధ, గొల్లగూడెం ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ సుబ్బారెడ్డి, గణితావధాని సూర్యనారాయణ మూర్తి పాల్గొన్నారు.

పోరాట యోధుడు జ్యోతిరావ్‌ఫూలే



యానాంలో పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్ఏఓ మునిస్వామి



తాళ్లరేవులో పూలే చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

యానాం: సంఘ సంస్కర్త, సామాజిక న్యాయంపై అలుపెరగని పోరాటం చేసిన జ్యోతిరావ్‌పూలే వర్ధంతిని గురువారం సమాచార శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటిఐ ప్రాంగణంలో ఆయన విగ్రహానికి ఆర్ఏఓ మునిస్వామి, ఎస్పీ రాజశేఖరన్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ అట్టడుగు వర్గాలకు పాఠశాలలను ఏర్పాటు చేయడం, కుల వ్యవస్థపై పోరాటం, మహిళా హక్కులను ప్రోత్సహించడం వంటి వాటిపై జరిగిన పోరాటంలో కీలపాత్ర వహించారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ షణ్ముగం, ట్రాఫిక్ ఎస్సై నూకరాజు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సీహెచ్ కె సుధాకర్, పీఆర్ఏఓ కొల్లు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పూలే సేవలు చిరస్మరణీయం

అమలాపురం రూరల్: దళితసేన ఆధ్వర్యంలో జ్యోతిబాపూలే వర్ధంతిని అమలాపురంలో నిర్వహించారు. పూలే చిత్రపటానికి దళితసేన అధ్యక్షుడు డేవిడ్ అంబేడ్కర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ భారత సామాజిక విప్లవ పితామహుడు మహాత్మా జ్యోతిరావు పూలే మహిళల దాస్య విముక్తి కోసం కాలినడకన సామాజిక ఉద్యమాన్ని ప్రారంభించారన్నారు.ఈ కార్యక్రమంలో వాకపల్లి హరీష్,సాపే రమేష్, తానంకి వసంత కుమార్, మాకే భవాని ప్రసాద్, కమిడి సామ్యూల్, రొక్కల రాజేష్ సాపే, దుర్గా ప్రసాద్, పల్లి రమేష్, మెట్టి బాబీ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: మహాత్మ జ్యోతీరావు పూలే వర్ధంతిని మండలంలోని ఆయా గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పలగుప్తం గ్రామంలో ఉన్న ఆయన విగ్రహానికి బీసీ నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు యనమదల పల్లం రాజు, చప్పిడి దుర్గారావు, గుత్తుల సూర్య, రాయుడు రమేష్, రాయుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: అణగారిన వర్గాల జీవితాల్లో అక్షర కాంతులు వెలిగించిన సామాజిక విప్లవ పితామహుడు మహాత్మా జ్యోతిరావ్ పూలే అని బుద్ధిస్టు సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా శాఖ కొనియాడింది. ముమ్మిడివరం బుద్ధపార్కులో బీఎస్ఐ జనరల్ సెక్రటరీ శరత్ అధ్యక్షతన మహాత్మా పూలే 134వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. పూలే, అంబేడ్కర్ చిత్రపటాలకు పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సామాజిక అసమానతలు తొలగించడానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎం.ఆశీర్వాదం, జనిపెల్ల సత్యనారాయణ, సఖిలే పృథ్వీరాజ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: సాంఘిక విప్లవ కారుడు, పీడిత జన బాంధవుడు మహాత్మా జ్యోతీరావు పూలే వర్ధంతి నిర్వహించారు. స్థానిక ప్రజా సంఘాల భవనంలో జరిగిన కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ 19వ శతాబ్దంలో వేళ్లూనుకుని ఉన్న కుల వివక్ష, మూఢ నమ్మకాలు, స్త్రీల అణచివేతకు వ్యతిరేకంగా ఆయన పోరాటం చేశారన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకువెళ్లడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు టేకి్లపూడి నాగేశ్వరరావు, పలు సంఘాల నాయకులు కుడుపూడి శివన్నారాయణ, టి.ఈశ్వరరావు, టి.లక్ష్మణరావు, వల్లు రాజబాబు, ఉంగరాల వెంకటేశ్వరరావు, అత్తిలి బాబూరావు, బొంతు మోహన్, కమిడి ఈశ్వరీబాయి, ధూళిపూడి వెంకటరమణ, మందాల గంగ సూర్యనారాయణ, కట్టా త్రిమూర్తులు, కొప్పిశెట్టి బాబి, జక్కల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



అమలాపురంలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దళితసేన నాయకులు



ముమ్మిడివరం బుద్ధ పార్కులో పూలే, అంబేడ్కర్ చిత్ర పటాలకు నివాళులర్పిస్తున్న నాయకులు



ఉప్పలగుప్తంలో పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీసీ నాయకులు